నల్లబిందె—దుక్క—చెంబు

భోగరాజు నారాయణమూర్తిగారు

౧

మా పెరటరుగు మాంచివిశాలంగానున్నా, చాలా పొడుగ్గానున్నా వుంటుంది. తెల్లవారేసరికి యింట్లోవున్న రెండు కుటుంబాల వాళ్లమున్నూ కూడా మొహాలు కడుక్కోడాని కక్కడ చేరుకుంటాం. కలిసీమెలిసీ వుండడంచేత, మాకూమాకూ అరమరాభ్యాంతరాల్లేవు. ఆపక్క వాళ్ల కాఫీ పొయ్యి-ఈ పక్క మా కాఫీపొయ్యి. కాఫీ డబ్బాలు, పంచదార డబ్బాలు, కప్పులు, సాసర్లు మొదలైన సామగ్రులతో 7 గంటలయేసరికి చీడీఅంతా చిన్న కాఫీహొటేల్లాగ తయారవుతుంది. మొహాలు కడుక్కోడానికి ప్రారంభించేది మొదలు కాఫీతాగేసేవరకూ మా పెరటరుగు పెళ్లివారి విడిదిలాగ కళకళ్లాడుతూ, చెరువొడ్డుచెట్టులాగ కిలకిల్లాడుతూ మహా సందడిగా వుంటుంది. నిజంగా శోభంటే అదే కదండీ? ఒక్క కుటుంబమే కానీయండి, రెండుకుటుంబాలే కానీయండి. ఆడవాళ్లే కానీయండి- మొగవాళ్ళే కానీయండి; మూతులు పొడిగించుకొని, ముహాలు ముడుచుకొని, ముక్కులు బిగించుకొని, మూసివాయినవు ముత్తయిదువుల్లాగ మాటాడుకోక అలకలూ, కోపాలూ, ద్వేషాలు పెట్టుక్కూచుంటే ఆకొంపకి శోభేమిటి? దిక్కుమాలిన శోభ. మావాళ్లంతా పానకాల భీమేశ్వరస్వాములు. నిత్యం కాఫీపుచ్చుకొంటూ వుంటారు.

కథలు, నవ్వులు, హాస్యాలు, పకపకలు, చకచకలు వీటితో క్రమంగా కాఫీల దగ్గర కూర్చుండేసరికి పువ్వులు కోసుకోడానికి, పాటవ్వ హాజరవుతూ వుంటుంది. రోజూ మావాళ్లకి పాటలు చెపుతూవుండడంచేత మగవాళ్లమంతా అవ్వకి పాటవ్వని పేరుపెట్టేం. అవ్వ వచ్చేసరికి ఆడవాళ్లంతాచుట్టూ మూగుతారు. ఒక్కొక్కచరణం అవ్వచెప్తూవుంటే వెనకాల వీళ్లంతా యేకరువు పెడుతూవుంటారు. బియ్యేలు ప్యాసయి, ట్రయినింగయిన పెద్దపెద్ద మొగవాళ్లకంటె నాకా అవ్వే బాగా నచ్చింది. నేనేవో డైరక్టరో, మినిస్టరో అయివుంటే అవ్వని వో ట్రయినింగు స్కూలికి హేడ్ మేస్టరుగా వేసేసుందును. ఏమంటారా? మా నాన్నికి నిండా నాలుగేళ్లేనా లేవా! దానిక్కూడా ఆ పాటలొచ్చేశాయి.

"ఆకత్తేతను లోకం తెలియక
అత్తిత్తయితిని కుత్నా!"

అని గెంతుతూ పాడుతూ వుంటుంది.

రెండుపూటలా మావంటలుకూడా పెరటరుగుమీదే. వంటిళ్లు నట్టిళ్లు లేక్కాదు సుమండీ! సదుపాయంగా వుంటుందని. మాది బ్రహ్మాండమైనంత యిల్లు; గొప్పనాలుగిళ్ల భవంతి. ఇదంతా మా పెరటరుగు తాలూకు వుదయగాథ. రాత్రిళ్ళభోగట్టా కూడా వినవలసిందే. వంటలూ భోజనాలూ అయింతరవాత

ఆపక్క వెంకమ్మగారూ, ఈప్రక్క మాఆవిడా అరుగు కడగడానికి ప్రారంభిస్తారు. వీళ్ళచాదస్తం బంగారంగానూ, అది కడగడంకాదు. చూసేవాళ్ళకి ప్రాణాలు విసిగిపోతాయి. వీళ్ళిద్దరికి రోజూ కాంపిటీషనే; ఎవరు చాలాసేపు కడుగుతే వాళ్లంత ఆచారవంతులూ, అంత శుచివంతులూ! ఆపోటీపరీక్షలో నల్లబిందె, దుక్కచెంబు, చీపురుకట్టా పట్టుకొని, తరుచుగా మాఆవిడే గెలుస్తూవుంటుంది. వెంకమ్మగారికీ విజయకాంక్ష వుందిగాని, కాస్త కాలం గడచిన మనిషా-మాఆవిడతో సమానంగా నిలువలేదు. భోజనాలుచేసి తాంబూలాలు వేసుకుంటూ మేమంతా వోమారు పెరట్లోకి వస్తాం. నవ్వుకుంటూవుంటాం. వెంకమ్మగారితో పోటీసందడేకాని, మాఆవిడ నాసంగతీ, మానాన్నిసంగతీ ఆలోచించదు. చీపురుకట్ట విడిచిపెట్టడవంటూ వుంటేనా పక్కవెయ్యడానికి? పక్కలేస్తేనేకాని మానాన్న పడుకోదు. అదిపడుకుంటేనే కాని నారాత జరగదు. ఏంచెయ్యమన్నారు చెప్పండి! రోజూ కూకలేస్తూవుంటాను; కసురుతూవుంటాను. నయాన్నీ భయాన్నీ చెప్పతూ వుంటాను. అయ్యో! మొగుడుముండా కొడుకన్న జ్ఞానం వాళ్లకి పుట్టాలికాని చెపుతే ఏస్తుందిటండీ? ఆలాగని కేవలం అర్ధాన్నం కాదుసుమండీ! కొంస్త చెప్తే వింటుంది. వింటుందికాని పంతమెక్కువ. ఆపంతమేనా వట్టి మొండిపంశం కాదు. కాదుకాని ఏంలాభం? నాకు రాతా కోతా జరగనీదు. కోపం తెప్పిస్తుంది. ఒక్కొక్కనాడు అమాంతంగా వెళ్లి ఆచేతులోవున్న చీపురుకట్ట లాక్కొని, ఆనల్లబిందే, దుక్కచెంబూ కిందపడేటట్టొక్క తాపుతన్ని-జుత్తొట్టుగొని లోపలి కీడ్చుకొద్దామన్నంత విరాళం పుడుతూవుంటుంది. నాది మాచెడ్డ వెర్రికోపం లెండి! అయితేనేమి? యుద్ధంలో గెలిచిన చీపురకట్టా, దుక్కచెంబూ వొకచేతా-నల్లబిందె వొకచేతా పట్టుకొని-పైటకొంగుతో బిగించికట్టిన నడుంకట్టుతోనూ, వంగికడగడంచేత మొహంమీదికి జారిన ముంగుర్లతోనూ, భుజంమీదనుండి ముందుకు వేలాడుతూవున్న తాచుపాంలాంటి జటతోనూ-ఆయాసపడ్డంవల్ల కలిగిన ఎగూర్పులూ, నిట్టూర్పులతోనూ-చిరునవ్వులు నవ్వుకుంటూ పిల్లనాడిస్తూవున్న నాదగ్గరకువచ్చి "పాపం మీపని కాలస్యమయిపోయింది కాబోలు! ఇదిగో వచ్చేశాను; కోంపడకండి" అంటుంది. ఆస్వరూపం చూసేసరికి, ఆమాటలు వినేసరికే - దిక్కుమాలిన కోపం——ఇంతకోపం ఏమయిపోతుందో మహామ్మాయమయి పోతుంది. గుండె నీరై పోతుంది; కడుపు చెరువై పోతుంది. వెఱ్ఱి మొహం వొకటి పుట్టుకొస్తుంది. నేం చెప్పేనుకానండీ? కాస్త చెపుతే వింటుంది. ఉన్న గట్టి చిక్కదొక్కటే. కొత్తచీపురు పట్టుకుంటీఅంటే గొరకైతేనేకాని విడిచి పెట్టదు. రోజుకో చీపురు. పట్టవాసంలో చీపురు కానీ. కిందటినెల్లో కేవలం చీపుళ్లకీ, ముగ్గుకీ 0_14_6 అయిందంటే నమ్ముతారా? ఎవడితో చెప్పకోడం? చెపుతే వెక్కిరించేవాళ్లేకాని అయ్యో అనేవాళ్లులేరు.

ఇదంతా సామాన్యంగా నిత్యం జరుగుతూవున్న వ్యవహారం. 'అయం విశేషః' అన్నట్లు ఒకనాడో చిత్రమైన నాటకం జరిగింది. ఆ నాటకానికి రంగస్థలం మాపెరటరుగు. ప్రధాన పాత్రలు మాఆవిడానూ, వెంకమ్మగారున్నూ. నాటకకథాబీజం మానల్లబిందే, దుక్క-చెంబు. ఇంక కథ వినండి. రాత్రి మేంవుభయులం భోంచేస్తూవుండగా ఎవరో స్నేహితులువచ్చి నాకోసం వీథిచావిట్లో కూర్చున్నారని తెలిసింది. అందుచే త్వరలో నే భోంచేసి—"పెద్దమనుష్యులు వచ్చారు; వెళ్లి మాటాడాలి; పిల్లనాడించడానికి వీల్లేదు; నువ్వుమాత్రం ఇవాళకట్టే విజృంభించక కాస్త పెందరాళే తెములుకొమ్మా" అని మరీమరీ చెప్పి సావిట్లోకి వచ్చాను. స్నేహితులతో మాట్లాడ్డానికి ప్రారంభించాను. ఇంట్లో మానాన్న యేడుపు ప్రారంభించింది. భోంచేసి మాఆవిడ యథావిధిగా వెంకమ్మగారితో యుద్ధం ప్రారంభించింది. పావుగం టయింది; అరగంటయింది; గంటయింది. మానాన్న యేడవడం మానదు-మాఆవిడ కడగడం మానదు. ఎంత అమాయకుడికైనా అలాంటప్పుడు కోపంవస్తుందా రాదా చెప్పండి! ఏంగ్రహచారమోకాని అన్ని విషయాల్లోనూ ఆడవాళ్ల మనసు మెత్తగానే వుంటుందిగాని పిల్లలు కడుపులు పొంగిపోయేటట్టు యేడుస్తూవుంటే ఎవరిపిల్లలోఅన్నట్లు నిర్లక్ష్యంగా పనిచేసుకుంటూ పూరుకుంటారు. ఇది ఆడవాళ్లలో సామాన్యంగావుండే అవగుణం. మావొదినగారికి ఓవేలు విడచిన మేనమామ తాలూకు సవితన్నగారి కుమార్తుండేది. ఆవిణ్ణిచెప్పండీ నిజంగా పిల్లల్ని ఆదరించడంలో. మాగొప్పయిల్లాలు; కిక్కురుమన్నిచ్చేదికాదు.

స్నేహితులతో మాటాడుతున్నానన్నమాటేకాని, నాదృష్టంతా యిటువేపే వుంది. లోపట రవరవ మండుకొస్తూంది కోపం. నేను పరధ్యాన్నంగా వుండడం కనిపెట్టే కాబోలు పెద్దమనుషులు లేచి సెలవుపుచ్చుకొన్నారు. చిత్తమని నేనూ లేచినాను: ఎలా లేచానో, యెలాపెరట్లోకి వచ్చానో నన్నడక్కండి. నాది వెఱ్ఱికోపమని చెప్పేవున్నాను. ఆ వెఱ్ఱికోపంతో వాళ్లు తెలియకుండావచ్చి మా ఆవిడవీపుమీా దేమో దెబ్బ వేశాంట. నిజంగా వేశేవుంటానులెండి. లేకపోతే అంతకోపం వచ్చి వుండదు. చీపురు తటాలున కిందపారేసి, వీపు తడుముకుంటూ, నా వేపు మొహం తిప్పి కొరకొర చూసింది. కాస్తగట్టిగా వేసుంటానేమో పాపం నొప్పెట్టింది కాబోలు కళ్లంట నీళ్లుకూడా వచ్చాయి. అది చూసేసరికి నాకూ కళ్లంట నీళ్లొచ్చాయి. గుండె దేవుకు పోయింది. మించా చెయ్యివిసిరేశాను. ఏం లాభం? మానాన్ని వొక్కమారే యేడుపు మానేసి, మా యిద్దర్నీ మిడుతూమిడుతూ చూడ్డం ప్రారంభించింది. "గుంటముండా! ఇప్పుడు నీ కడుపు నిండిందా? ఇఖహాయిగా పడుకుందుగాని రా". అంటూ మాఆవిడ వొక్కవిసురుతో గుభీమని పెరటి తలుపులువేసి పిల్లని తీసింది. తలుపు పక్కనేవున్న నా కప్పుడు కపాలమోక్షం కావ

లిసిందే. కాని కొంచెంలో తప్పిపోయింది. ఇహ నే నట్టేసే పక్కడ వుండడం వుభయులకూ క్షేమంకాదని భావించినటువంటివాడనై సావిట్లోకి వచ్చేశాను. చుట్టకాలుస్తూ వోఅరగంట సేపు ఈజీచైరుమీద కాలక్షేపం చేశాను. చుట్టయిపోయింది. ఇహ తమలపాకులు చుట్టిమ్మందామా, వీధిలోకి వెళ్లి కిల్లీ తెచ్చుకొని గుప్ చప్ గా వూరుకుందామా అన్న సందిగ్ధంలో పడ్డాది మనస్సు. పడ్డాదికాని కొంచెంలోనే మళ్లా సర్దుకుంది. ఈకోపాలూ తాపాలూ ఎందుకు! రాజీ చేసుకుందామనే నిశ్చయం చేసుకున్నాను. దీర్ఘకోపం వుండకూడదు చూడండీ! ఏవో పొరపాట్లు వస్తాయి మరి! సర్దుకోకపోతే యెలాగ? ఆవుద్దేశంతోటే లోపలికి వచ్చాను. నేను వచ్చేసరికి పరుపులు వేశేసున్నాయి. పెరటితలుపులుకూడా వేశేశేవున్నాయి. లాంతరు ఖణీగా వెలుగుతూంది. తల్లీపిల్లా పడుకున్నారు. ముందరి తలుపులు గడియపెట్టేసి, దీపం తగ్గించి మంచం కాస్తదగ్గరగా యీడ్చుకొని కాళ్లు దులుపుకొని పెద్దమనిషిలా పడుకున్నాను. "ఏయ్! ఇదిగో! చూడూ! తమలపాకులు చుట్టావ్?" అన్నాను. పలక లేదు. దాహం వేస్తున్నాది మంచినీళ్లు కావాలన్నాను. సపోటాపళ్లు ముగ్గేయేమో చూడమన్నాను. మీనాన్న కుత్తరం రాశావా కవరు తెచ్చానన్నాను. ఇవాళేమోగాని కాళ్లు పీకుతున్నాయన్నాను. కొంతసేపు దగ్గేను. కొంతసేపు కూన్రాగాలు తీశాను. ఎన్ని చేసినా నాశపభిష లేమీ పనికొచ్చాయి కావు. ఇహ రాజీ కుదరడం అసాధ్యమనే తోచింది. అందుచే మన ఖర్మాన్ని మనం హాయిగా పడుకోవడమే అత్యుత్తమ మనుకొని దీపం ఆరిపేశాను. ఆరిపేశానుగాని నిద్రపట్టడం యెలాగ? దొంగనిద్ర అభినయిస్తూ కదలకుండా గంటలకొలదీ పడుకోవడంలో ఆడవాళ్లకున్న నేర్పు మనకుండదు. మనస్సులోవున్న యీ బాధకు తోడుగా పైని దోమలబాధకూడా అఖండంగా బాధిస్తూంది. "ఇదిగో! చూడూ! దోమలు కరిచేస్తున్నాయి. పిల్లకేమేనా కప్పేవా? లేదా" అని గంభీరముగా గద్దించి యడిగేను. అడగడమే కాకుండా స్వయంగా లేచి చేత్తో తడిమి చూశాను. పిల్లక్కప్ప లేదు. "ఇదిగో! చూడూ! పిల్లక్కప్పకుండా పశువులా పడుకున్నావ్! లే! కప్పు! లేచావా? ఏం? చూడూ! ఏమిటీ! ఇదుగో!" అని తట్టిలేపేను. ఇదుగో అన్నా లేదు; అదుగో అన్నా లేదు. ఇహ నట్టే తాపత్రయం పడ్డం మన కంత పౌరుషం కాదనుకొని యథాప్రకారం తిష్ఠవేశాను. మూడురోజుల్దాకా గిజామన్నా మాటాడకూడదని శపథం చేసుకున్నాను.

౨

ఎలాగో తెల్లవారింది. యథాక్రమంగా అంతా పెరటరుగుమీద చేరుకున్నారు. రాజీనామా వ్యవహారంలో పడి రాత్రి చాలాసేపు నిద్రలేకపోవడంచేత నాకింకా తెలివి రాలేదు. నవ్వులో, హాస్యాలో, పాటలో, పద్యాలో నాకు రోజూ తెలివితెప్పిస్తూండడం మామూలు. ఆ వేళ మాత్రం ఆలాక్కాదు. "అయ్యో!

అయ్యో దుక్కచెంబే? దుక్కచెంబే? నల్లబిందే? నల్లబిందే. ఎంత దారుణం? ఎంతదారుణం?" అన్నమాటలు నన్ను నిద్రమంచంనుండి గుభీమని లేవదీశాయి. చెవిని బడగానే అవి వెంకమ్మగారి మాటలని పోల్చేశాను. తలాపు దిక్కున పరుపుకింద వున్న చుట్టా అగ్గిపెట్టీ తీసి చుట్టముట్టించి పెరట్లోకివచ్చాను. "దుక్కలాంటి చెంబే కూతరా" అని వెంకమ్మగారు బుగ్గలు నొక్కుకొని వింతపడుతున్నారు. "గుమ్మిడిగింజలాంటి బిందే అమ్మా!" అని పాటవ్వ గుండె బాదుకొంటూంది. "నన్ను చంపేస్తారు కాబోలు?" అంటూ బిక్కమొహంవేసి మా ఆవిడ బల్లిలాగ గోడకంటుకుపోయింది. "మీఆయన్తో చెప్పక గుప్‌చప్‌గా వూరుకో వోవోవిడా" అని కాఫీపొయ్యి వూత్తూ మొహం యెత్తి పొగచే కళ్లు మిటకరిస్తూ వొకావిడ సలహా చెపుతూంది. అలాంటి రసగంధాయంలో నేను రంగస్థలం ప్రవేశించాను. నన్ను చూస్తూనే అంతా తెల్లపోయారు. ఎవరిపనులు వారు చేసుకుంటూ నిశ్శబ్దంగా వూరుకున్నారు. మాఆవిడి కరచరణాలాడ్డంలేదు. ఎవరేనా భోగట్టా చెప్తారేమో అని కాస్త పస్తాయించి చూశాను. ఎవరూ మాటాడరు. చుట్టయిపోయింది. పుల్ల నోట్లో పెట్టుకొన్నాను. మా ఆవిడ కాఫీపొయ్యదగ్గిర మెల్లిగా చేరుకుంది. 'నల్లబిందే దుక్కచెంబూ అంటున్నా రేమిటి భోగట్టా' అని అడగడానికి వీల్లేకుండా, మూడురోజుల్దాకా మాటాడనని రాత్రి ఘోరమైన శపథం చేసుకున్నాను. అలాంటి విషమావస్థలో మానాన్ని యేమూల్నుంచో చేతు లూపుకుంటూ, బొజ్జాడించుకొంటూ పరుగెత్తు కొచ్చి, "నాన్నాలూ, నాన్నాలూ! అమ్మ బిందేను తెంబూనూ ఎత్తలోపాలీచిందంనీ! తూతేలా?" అని చెప్పింది. అక్కడ వున్నవాళ్లంతా ఆ మాటలువిని నవ్వుకున్నారు. చెప్పేసిందని మానాన్నని ముద్దుతిట్లు తిట్టేరు. "వెంకమ్మగారూ! బిందేనూ చెంబూనూ ఎలాంపోయుంటాయండీ? చూశారా? దీని అజ్నాగత్త! ఇహా నీజన్మానికి దీనికి బుద్ధిరాదండి!" అని యింకా నేనేమో చెప్తూవుండగానే, వెంకమ్మగారొచ్చి, "మీరాట్టే తొందరపడకండి ఎక్కడో వుంటాయి. ఏమవుతాయివుండక? ఇంకా చిన్నతనమా! సంసారం జాగ్రత్త అప్పుడే యెలా తెలుస్తాయి? మాకాలంలో ఈయీడుకింకా మాకన్నం తినిపిస్తూవుండేది మాఅమ్మ." అన్నారు. నేను విసుక్కుంటూ, "ఔనమ్మా! బాగానేవుంది. దీనిక్కూడా అన్నం తినిపించనీయండీ! నా కభ్యంతరం లేదు. బిందెమాటా చెంబుమాటా ఏమిటాలోచిస్తారు? వున్నట్టా? పోయినట్టా? కొంప తీసి రాత్రి ఇంట్లోపెట్టడం మరిచిపోయి ఆతామసంమీద తలుపులు వేసేసుకొని పడుకొంది కాబోలు? పెరట్లో మరిచిపోతే మరిదొరికేదేమిటి వెంకమ్మగారూ! ఉత్తపశువు! పశువు! ఛీ? అని పళ్లు పటపట కొరికేను. నాకు కోపం వస్తే చేతులు వొణుకుతాయి. ఆవొణకడంలో నాలిగ్గీసుకుందా మనుకుంటూవున్న పుల్ల కింద పడిపోయింది. మరోపుల్లకోసం ఇటూ అటూ

చూశాను. మాఆవిణ్ణి తన్నడానికి చూస్తున్నానని వెంకమ్మగారు మొదలైన వారంతా అనుమానంపడి, 'లోపలికి వెళ్లిపో' అని సంజ్ఞలు ప్రారంభించారు. మాఆవిడమాత్రం కాఫీ పొయిదగ్గరనుండి కదలలేదు. నాలుగ్గిసుకోడానికి బద్దతెమ్మందామా అనుకుంటూ శపథం జ్ఞాపకంవచ్చి నేనే లేచాను. నేనులేవడం వాళ్ల అనుమానానికి మరింత కారణ మయింది. అందుచే మరింత గాబరాపడ్డారు. మాఆవిడికి వొళ్లువొణకడం ప్రారంభించింది. లేచి అరుక్కొసనువున్న కర్రలమోపుదగ్గరకు వెళ్లి వోకర్ర తీశాను. దాని బద్దతీసి నాలుగ్గిసుకుందామని నావుద్దేశం. నేనాకర్రతీసి తియ్యడంలో అంతాగొల్లు మన్నారు. మా ఆవిడికప్పుడే గంగాదేవి ప్రత్యక్షమయింది. "కర్రపడీయండి! కర్రపడీయండి! వొద్దువొద్దు" అని వెంకమ్మగారు నాకడ్డంగా వొస్తున్నారు. "అడ్డుకోకండి పిన్నీ! అడ్డుకోకండి! చంపేసీయండి! నన్ను చంపేసీయండి" అని మాఆవిడ యేడుస్తూ అంటూంది. నాఖర్మాన్ని నేనుబద్ద తీసుకొని ఏమిటీ హడావిడని తిరిగిచూసేసరికి, ఫార్సీ నాటకపుస్టేజిలాగ రంగమంతా అత్యద్భుతంగా మారిపోయింది. చంద్రమతిని నరికేయడానికి సిద్ధపడ్డప్పుడు హరిశ్చంద్రుడికి పార్వతీ పరమేశ్వర్లు ప్రత్యక్ష మయినట్లు-వెంకమ్మగారి గుమ్మంలో మానల్లబిందె దుక్కచెంబూ నాకు ప్రత్యక్షమయినాయి. నాకత్యద్భుతమనిపించింది. మా ఆవిడ తెల్లపోయి వెర్రి మొహంవేసింది. వెంకమ్మగారు మొదలైన వారంతా గుసగుస నవ్వుకుంటున్నారు. రాత్రి మాఆవిడ ప్రణయకోపంచేత-ప్రణయ కోపం కాదు—ప్రళయకోపంచేత - పెరట్లో మరిచిపోయిన నల్లబిందే దుక్కచెంబూ తీసి దాచి వెంకమ్మగారే యిలాంటి తమాషా చేశారని బుద్ధిమంతుణ్ణి కాబట్టి వెంటనే పోల్చేశాను. కింద ధుమ ధుమ లాడుతూ నిశ్శబ్దంగానున్న మాపెరటరుగు, ఇప్పుడు పకపకలు, చకచకలూ, చప్పట్లూ, హాస్యాలూ నవ్వులూ_ఓ! కావలసినంత కలకలం పుట్టింది. మొహం బాగా వికసించి మాఆవిడ కూడా నవ్వ ప్రారంభించింది నేనూ వోమారు నవ్వుకున్నాను. ఇహ నేముంది?

మా చందాదారులకు

మా కార్యాలయమునకు వ్రాయు ఉత్తరములు మొదలయినవానియందు తమ 'చందాదారు' సంఖ్య వ్రాయవలెను. లేకున్న ప్రత్యుత్తరములు మొదలయిన పనులను జరుపజాలము. చందాదారులసంఖ్య భారతి కవరుకాగితముపై తమ విలాసమునకు ముందున్నది. చందాదారులకు భారతి ౧౦-వ తేది లోపల అందకపోయిన యెడల వెంటనే తపాలువారికిని, మా కార్యాలయమునకును తెలుప గోరెదము

మేనేజరు, 'భారతి.'